'ఉపాధి హామీ'తో ఫాంపాండ్స్, ఫిష్‌పాండ్స్

- ప్రజలను పదే పదే తిప్పించుకోవద్దు
- అభివృద్ధి కార్యక్రమాల్లో జాప్యంవద్దు
- సమీక్షలో మంత్రి సీతక్క

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఉపాధి హామీ పథకం కింద ఈసారి ఫాం, ఫిష్‌పాండ్స్, పంచాయతీ, అంగన్‌వాడీ, మహిళా భవనాలకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం తన చాంబర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం ఉండొద్దని మంత్రి సీతక్క ఆదేశించారు. అధికారులంతా నిబద్ధతతో, అంకితభావంతో ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని కోరారు. వివిధ సమస్యలతో అధికారుల వద్దకు ప్రజలను పదేపదే తిప్పించుకోకుండా మండల స్థాయిలోనే వాటికి పరిష్కారం చూపాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు 800 కోట్ల పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సిబ్బందికి 2 నెలల వేతనాల కోసం 46 కోట్లను మంత్రి విడుదల చేయించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లలో మౌలిక వసతులు కల్పించాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ మార్కెట్లలో మౌలిక వసతులు కల్పించడంతో, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రైతులు, వ్యాపారులకు అవసరమైన వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. కేంద్రం నిధులపై ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. హైదరాబాద్ సమీపంలో నిర్మిస్తున్న కోహెడ మార్కెట్‌ను అత్యాధునిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసి, దేశంలోనే బెస్ట్ మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుదామని మంత్రి పిలుపునిచ్చారు. టెస్కో, గోల్కొండ హ్యాండిక్రాఫ్ట్స్, చేనేత అభివృద్ధి కార్పొరేషన్, పవర్‌లూమ్, టెక్స్‌టైల్స్ అభివృద్ధి కార్పొరేషన్, టీఎస్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టీఎస్ పవర్‌లూం కార్పొరేషన్‌పై కార్పొరేషన్లను సమ్మేళనం చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మార్చి 31 వరకు కొనసాగించేందుకు నిధుల కోసం నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

ఆర్టీసీకి 1,050 కొత్త బస్సుల రాక

- నేడు రోడ్డెక్కనున్న 80 కొత్త బస్సులు
- ప్రారంభించనున్న మంత్రి పొన్నం
- మరో 1,040 ఎలక్ట్రిక్ బస్సులూ కొనాలని నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా టీఎస్ఆర్టీసీ సంస్థ బస్సుల సంఖ్యను పెంచనున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.400 కోట్లతో 1,050 బస్సులను కొనుగోలు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే సంస్థ కొనుగోలు చేసిన అత్యాధునిక హంగులతో కూడిన 80 కొత్త బస్సులు శనివారం నుంచి రోడ్డెక్కనున్నాయి. వీటిని హైదరాబాద్ ఎన్టీఆర్ మార్గ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారు. వీటిలో 30 ఎక్స్‌ప్రెస్, 30 రాజధాని ఏసీ, 20 లహరి స్లీపర్ కమ్ సీటర్ (నాన్ ఏసీ) బస్సులు ఉన్నాయి. మిగతా 970 బస్సుల్లో 400 ఎక్స్‌ప్రెస్, 512 పల్లె వెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, 56 ఏసీ రాజధాని బస్సులు ఉన్నాయి. వీటికితోడు హైదరాబాద్ సిటీలో 540, ఇతర ప్రాంతాలకు 500 పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ఈ ఏడాదిలోనే వాడకంలోకి తేనున్నది.

కరోనాపై గప్‌చుప్!

- కేసులు వెల్లడించని వైద్యారోగ్య శాఖ
- సమీక్షలు, సమావేశాలకే అధికారులు పరిమితం

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): కరోనా కేసుల విషయంలో రాష్ట్ర సర్కారు నిర్లక్ష్య ధోరణి కొనసాగుతున్నది. రాష్ట్రంలో కొవిడ్ పరిస్థితిపై వైద్యారోగ్యశాఖ ఎలాంటి వివరాలు వెల్లడించడం లేదు. అధికారులు సమీక్షలు, సమావేశాలకే పరిమితమయ్యారు. కొవిడ్ కట్టడికి ముందస్తు చర్యలంటూ ఆర్భాటంగా ఆదేశాలు జారీ చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదు. అటు ప్రజలకుగానీ, ఇటు మీడియాకు గానీ ఎలాంటి వివరాలు వెల్లడించడం లేదు. వాస్తవానికి ప్రతిరోజు సాయంత్రం 4 గంటల వరకు 'కొవిడ్ బులెటిన్'ను మీడియాకు విడుదల చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. కానీ వారు ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. కొవిడ్ అనుమానిత లక్షణాలు ఉన్నవారికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేయాలని, ఈ మేరకు అన్ని పీహెచ్‌సీలకు టెస్టింగ్ కిట్లు పంపించాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉన్నది.

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలి

- అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షమే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు

శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): 'పార్లమెంట్ ఎన్నికల్లో నూతనోత్సాహంతో పనిచేసి సత్తాచాటాలి. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల పక్షాన ఉండి వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చూడాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేవరకు, పథకాలు ప్రజలకు చేరే వరకు పోరాడాలని సూచించారు. అయ్యప్ప దయ, స్వామి ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కేటీఆర్ విస్తృతంగా పర్యటించారు. స్థానిక తెలంగాణ భవన్‌లో మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలపై ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తనకు రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్ల ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని స్పష్టంచేశారు. అభివృద్ధిలో సిరిసిల్లను రాష్ట్రానికే ఆదర్శంగా నిలిపానని గుర్తుచేశారు. ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉన్నదని, అందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రజాపాలనలో అర్హులందరితో అన్ని పథకాలకు దరఖాస్తు చేయించాలని నాయకులకు సూచించారు. పట్టణ ప్రజలకు ఏ సమస్యలున్నా, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విలీన గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా చేసేందుకు మున్సిపల్‌లో తీర్మానం చేయాలని చైర్‌పర్సన్ జిందం కళ, కౌన్సిలర్లకు సూచించారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనకు చెప్పాలని కోరారు. స్వయంగా తానే వచ్చి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం విశ్వబ్రాహ్మణ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (వోపా) నూతన క్యాలండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వోపా భవన నిర్మాణానికి సహకారం అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు గూడూరి ప్రవీణ్, బొల్లి రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యుత్తు వసతి కల్పించాలి

- వేతన బకాయిలు, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టికి వేర్వేరు ఉపాధ్యాయ సంఘాల వినతి

భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెజిటిడ్ హెచ్ఎంల సంఘం నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని వివిధ సంఘాల ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలను విన్నవించారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 22 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు నవంబర్ వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నట్టు జెజిటిడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నేతలు రాజాభాను చంద్రప్రకాశ్, గిరిధర్ తెలిపారు. సమగ్రశిక్ష పథకానికి ప్రభుత్వం 40% గ్రాంట్ కింద 150 కోట్లు విడుదల చేస్తే కేంద్రం నుంచి 600 కోట్లు విడుదలయ్యే అవకాశం ఉన్నదని వివరించారు. టీచర్లు, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ అధ్యక్షుడు ఉమాశంకర్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. 7 నెలలుగా వేతనాలు రావడం లేదని తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్ర సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రాజు, ఆంజినేయులు తెలిపారు. ఎస్సీఈఆర్టీలో అక్రమ డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి పాఠశాలలకు పంపాలని లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు సానా సురేందర్, మామిడోజు వీరాచారి తదితరులు ప్రభుత్వ కార్యదర్శి బుర్ర వెంకటేశంను కోరారు.

విద్యుత్తు కొరత రాకుండా చూడాలి

- సింగరేణి సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): వేసవిలో విద్యుత్తు కొరత రాకుండా అన్ని థర్మల్ కేంద్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లోని థర్మల్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గును రవాణా చేయాలని సింగరేణి ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆ సంస్థలోని అన్ని విభాగాలపై శుక్రవారం ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి గురించి తెలుసుకుని, తదుపరి కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. కొన్ని బొగ్గు బ్లాకులను వేలం వేయాలన్న కేంద్రం ప్రతిపాదనను కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నందున సంస్థకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకోవాలని డిప్యూటీ సీఎంకు అధికారులు విజ్ఞప్తి చేశారు. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అధ్యయనం చేసినట్టు తెలిపారు.

మంచిర్యాల ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి

- భట్టికి బాధిత సంఘం వినతి

హిమాయత్‌నగర్, డిసెంబర్ 29: తమ ప్లాట్లను ఆక్రమించి వేధింపులకు గురి చేస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగ, దళిత బహుజన ప్లాట్ ఓనర్స్ సొసైటీ ప్రతినిధి బృందం శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరింది. ఈ మేరకు ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని వంపుగూడ గ్రామంలో 706 ప్లాట్లను కొనగా, 2004లో ప్రేమ్‌సాగర్‌రావు తమ ప్లాట్లపై కన్నేసి నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించునేందుకు ప్రయత్నిస్తున్నారని, కట్టుకున్న ఇండ్లను అతని అనుచరులతో కూల్చివేయిస్తున్నాడని ఆరోపించింది. తమకు న్యాయం చేయాలని కోరింది.

వచ్చేనెలలో స్విట్జర్లాండ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

- ప్రపంచ ఆర్థిక సదస్సు కోసం దావోస్ టూర్

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): స్విట్జర్లాండ్ దేశంలోని దావోస్ నగరంలో వచ్చే నెలలో జరుగనున్న 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమ్మిట్' (ప్రపంచ ఆర్థిక సదస్సు)కు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. జనవరి 14 నుంచి 19 వరకు జరిగే ఈ సమ్మిట్‌లో ఆయనతోపాటు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా పాల్గొననున్నారు. తెలంగాణలో ఉన్న అవకాశాలపై సీఎం అక్కడ ప్రసంగించనున్నట్టు తెలిసింది. రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా పలువురు పారిశ్రామికవేత్తలతో చర్చలు జరపనున్నారు. వారి వెంట ఆర్థిక, ఐటీ శాఖ అధికారుల బృందం వెళ్లనున్నది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్‌రెడ్డి తొలి విదేశీ పర్యటన ఇదే. ఇదే సదస్సుకు ఏపీ నుంచి ఆ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరు కానున్నట్టు తెలిసింది.

'కౌన్ బనేగా కరోడ్‌పతి'లో రేవంత్‌పై ప్రశ్న

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం కొనసాగుతున్న కౌన్ బనేగా కరోడ్‌పతి (కేబీసీ) సీజన్ 15లో ఆసక్తికర సంఘటన చోటు చేసుకున్నది. డిసెంబర్ 15న ప్రసారమైన ఎపిసోడ్‌లో ఈ కార్యక్రమ హోస్ట్ అమితాబ్ బచ్చన్ పోటీకి వచ్చిన యువతికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గురించి ప్రశ్న వేశారు. రేవంత్‌రెడ్డి ఏ రాష్ట్రానికి ఇటీవల ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని అడిగారు. రూ.40 వేల ప్రశ్నగా దీన్ని బిగ్‌బీ అడిగారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ అనే ఆప్షన్లు ఇచ్చారు. కానీ ఆ యువతికి సమాధానం తెలియలేదు. దీంతో ఆమె జవాబు కోసం లైఫ్‌లైన్ సహాయం తీసుకోగా, 80 శాతం మంది 'తెలంగాణ' అని చెప్పారు. 11 శాతం మంది ఛత్తీస్‌గఢ్ అని ఆన్సర్ ఇవ్వగా.. మిగతావారు సీ, డీ ఆప్షన్లు సూచించారు. ఎక్కువ మంది సూచించిన సమాధానాన్ని ఎంచుకున్న ఆ యువతి తదుపరి ప్రశ్నకు అర్హత సాధించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society, Ministry of MSME)
Balanagar 'X' Roads, Hyderabad-500037 (TS) INDIA.
NOTIFICATION FOR CONTRACTUAL POSITIONS
Central Institute of Tool Design, Balanagar, Hyderabad, an autonomous body, under the Ministry of MSME, Govt of India, looking for candidates to be engaged full time with fixed tenure (11 months) on contract basis for the following posts :

S.No	Name of the Post	No. of Vacancy	Location
1	CAD Engineer (Trg)	01	Karimnagar
2	VLSI and Embedded Engineer (Trg)	01	
3	CAD CAM Engineer (Trg)	01	Kolar

Interested Candidates may send their CV and Other credentials to email: jbramheswaraiah@citdindia.org. Salary will be paid best in Industry.
The last date for receipt of CV is 02.01.2024, 18.00 hrs.
Walk-in interviews on 03.01.2024 & 04.01.2024 at Central Institute of Tool Design (CITD) Hyderabad.
For detailed information, kindly visit our website: www.citdindia.org
Sd/-
PRINCIPAL DIRECTOR

సింగరేణి ఎన్నికలతో రాజకీయాలకు సంబంధం లేదు

- సీపీఐ జాతీయ కార్యదర్శి

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఎన్నికల తర్వాత రాజకీయంగా కాంగ్రెస్, సీపీఐ మధ్య తగువు వచ్చిందనేది తప్పుడు ప్రచారం అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. ఈ విషయమై నారాయణ శుక్రవారం ఒక వీడియో విడుదల చేశారు. కాంగ్రెస్, సీపీఐ మధ్య వచ్చిన భేదాభిప్రాయాలతో ఈ రెండు పార్టీలు విడిపోతాయని కొందరు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మిక సంఘాల ఎన్నికలకు, రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సింగరేణిని దక్కించుకోవడం సంతోషంగా ఉందని నారాయణ చెప్పుకొచ్చారు.

శ్రీశైలంలో అభిషేకాలు రద్దు

- స్పర్శ దర్శనాలు కూడా..

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో డిసెంబర్ 31, జనవరి 1న ఆర్జిత అభిషేకాలు, స్పర్శ దర్శనాలు రద్దు చేసినట్టు ఆలయ ఈవో పెద్దిరాజు తెలిపారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. భక్తుల రద్దీ దృష్ట్యా భక్తులందరికి త్వరితగతిన దర్శనాలు కల్పించడంలో భాగంగా స్వామివారి స్పర్శ దర్శనం, గర్భాలయ అభిషేకాలు కూడా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. సామూహిక అభిషేకాలు, బ్రేక్ టికెట్ పొందిన భక్తులకు కూడా స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నారని, భక్తులు గమనించాల్సిందిగా కోరారు.

గ్యారెంటీ దరఖాస్తులు ట్రంకు పెట్టెల్లోకి!

- వార్డు, డివిజన్‌కు ఒకటి చొప్పున కొనుగోలు
- పురపాలికలకు ఉన్నతాధికారుల ఆదేశాలు
- దరఖాస్తుల స్వీకరణ తర్వాత చర్యలేమిటి?
- అధికార యంత్రాంగంలో కరువైన స్పష్టత
- పథకాల అమలుపై అనేక సందేహాలు
- రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల కొరత
- భారీ క్యూలైన్లతో పలు చోట్ల తొక్కిసలాట
- మెదక్ జిల్లాలో గుండెపోటుతో వ్యక్తి మృతి

ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద అధికారులకు దరఖాస్తులు అందజేస్తున్న మహిళలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): కోటి ఆశలతో నిరుపేదలు 'కాంగ్రెస్ గ్యారెంటీ'ల కోసం చేసుకుంటున్న దరఖాస్తులను ట్రంకు పెట్టెల్లో భద్రపరచనున్నారు. ఈ మేరకు పురపాలికలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డుకు ఒక ట్రంకు పెట్టె చొప్పున కొనుగోలుచేసి దరఖాస్తులన్నీ వాటిలో భద్రపరచాలని సూచించారు. దీంతో ప్రస్తుతం అధికారులు ట్రంకు పెట్టెల కొనుగోళ్లపై దృష్టి సారించారు. దరఖాస్తుల స్వీకరణ తర్వాత ఏం చేయాలనే దానిపై స్పష్టత కరువైంది. కొన్ని చోట్ల కంప్యూటరీకరణకు కసరత్తు చేస్తుండగా, చాలా చోట్ల ఆదేశాలు రాలేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో లక్షల్లో వచ్చిన దరఖాస్తులను కంప్యూటరీకరించేందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉన్నది. అందుకు పెద్దఎత్తున కంప్యూటర్ ఆపరేటర్లు కావాలి. అసలు కంప్యూటరీకరణకు ఒక నమూనానే లేదని ఓ అధికారి వెల్లడించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు సైతం మరికొన్ని నెలల సమయం పట్టేలా ఉన్నది.

ఒక్కో ట్రంకు పెట్టెకు రూ.1,800

ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ రెండో రోజు ముగిసింది. లక్షలాది దరఖాస్తులు కార్యాలయాలకు వచ్చి పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటన్నింటినీ ట్రంకు పెట్టెల్లో భద్రపరచాలంటూ అధికారులు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే, ఒక్కో ట్రంకు పెట్టెకు రూ.1,800 వరకు ధర ఉండటంతో కొన్ని మున్సిపాలిటీల్లో డబ్బులు ఎవరు ఇవ్వాలి? అనే సందేహాలు తలెత్తాయి. మరోవైపు దరఖాస్తుదారుడికి ముద్ర వేసి రశీదు ఇవ్వాల్సి ఉన్నందున కౌంటర్లకు అనుగుణంగా ముద్రలు కూడా లేవని, శుక్రవారం కొత్తవాటికి ఆర్డర్ ఇచ్చామని హైదరాబాద్ శివారు మున్సిపాలిటీకి చెందిన అధికారి ఒకరు తెలిపారు. మరికొన్ని చోట్ల ట్రంకు పెట్టెలు కొనుగోలు చేయకుండా దరఖాస్తులను ఒక గదిలో భద్రపరుస్తున్నారు. కంప్యూటరీకరణ జరిగే వరకు ఎంత సమయం పడుతుందో తెలియనందున, ఆ ప్రక్రియ అంతా జరిగేలోపు కార్యాలయాల్లో దరఖాస్తులను కాపాడటం ఒక సవాల్ అని అధికారులు అంటున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని కాగజ్‌మద్దూర్‌లో గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోడానికి వచ్చిన ఓ రైతు గుండెపోటుతో మరణించారు. కుసంగి లక్ష్మయ్య(58) శుక్రవారం దరఖాస్తు ఇవ్వడానికి పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. ఫారాన్ని అధికారికి ఇస్తుండగానే గుండెపోటు రావటంతో కుప్పకూలాడు. గ్రామస్థులు హుటాహుటిన లక్ష్మయ్యను నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు లక్ష్మయ్యకు భార్య స్వరూప, ఇద్దరు కుమారులు ఉన్నారు. జగిత్యాలలోని 30వ వార్డు గోరేమియా చౌరస్తాలో దరఖాస్తుల పంపిణీలో తొక్కిసలాట జరిగింది. హైమదీబేగం అనే మహిళ చేతికి గాయమైంది. స్థానిక కాంగ్రెస్ నేత ఇంట్లో దరఖాస్తు ఫారాలను అందించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలకు గ్యారెంటీల తిప్పలు

దరఖాస్తుల స్వీకరణ రెండోరోజూ ప్రజలకు తిప్పలు తప్పలేదు. ఓవైపు దరఖాస్తుల కొరత, మరోవైపు దొరికిన ఫారాలు నింపి, అధికారులకు ఇచ్చేందుకు ప్రజలు అవస్థలు పడ్డారు. మొదటి రోజు జరిగిన లోటుపాట్లను సరిచేసుకోవాలని సీఎస్ శాంతికుమారి, కలెక్టర్లు ఆదేశించినా పెద్దగా ఫలితం కనిపించలేదు. కొన్నిచోట్ల గ్రామసభకు ముందే కొంతమంది దళారుల చేతిలోకి దరఖాస్తు ఫారాలు వెళ్లాయి. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం పోసానిపల్లిలో కరెంట్ బిల్లులు ప్రజాపాలన కౌంటర్ వద్దే వసూలు చేశారు.

కలెక్టర్లతో సీఎస్ టెలికాన్ఫరెన్స్

ప్రజాపాలనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని సీఎస్ శాంతికుమారి తెలిపారు. రెండోరోజు మొత్తం 8,12,862 దరఖాస్తులు అందాయని వెల్లడించారు. పట్టణ ప్రాంతాలు, జీహెచ్ఎంసీతో కలిపి 4.89 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 3,23,862 దరఖాస్తులు అందినట్టు వివరించారు. శుక్రవారం ఆమె కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మొదటి రోజు ఎదురైన సమస్యలను పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకొన్నందుకు అభినందించారు. దరఖాస్తు ఫారాలను విక్రయించకుండా చూడాలని మరోసారి స్పష్టంచేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని, దరఖాస్తులు నింపడంలో సహకరించేలా వలంటీర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.